క్లుప్తంగా

'పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో విఫలం'



నర్సంపేట: పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలమయ్యారని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 15 నెలలుగా కాంగ్రెస్ నాయకులు అరాచకాలు, కబ్జాలు, దాడులకు పాల్పడుతున్నా పోలీసు, ఇతర శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీఐ కాంగ్రెస్ నాయకులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. స్థానిక పోలీసుల తీరుపై గతంలో సీపీకి లేఖలు రాసిన, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలపైన కన్నేసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. పట్టణంలో అరాచకాలు, నమోదవుతున్న కేసులపై సీపీ, డీసీపీ, కలెక్టర్ సమీక్షించాలని కోరారు.

కొమ్మాల జాతరకు రండి

గీసుకొండ : హోలీ పండుగ నుంచి కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర ప్రారంభం కానున్న క్రమంలో తమ ప్రభబండిని ప్రారంభించడానికి రావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి ఆహ్వానించారు. మంగళవారం హనుమకొండలోని కొండా మురళి నివాసానికి వెళ్లి ఆయనకు ఆహ్వాన పత్రికను అందించారు. నాయకులు గోపాల నవీన్‌రాజు, వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్, డోలె చిన్ని తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన బొల్లు వెంకటయ్య, ఇల్లందకు చెందిన గుండు వీరేశంలకు వరంగల్ లయన్స్ క్లబ్ థౌజెండ్ పిల్లర్స్ ఆధ్వర్యంలో మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చొప్పరి సోమయ్య మాట్లాడారు. వెంకటయ్య, వీరేశం వరంగల్‌లోని అండర్ బ్రిడ్జి వద్ద పండ్లు అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వేసవి ఎండల నేపథ్యంలో చిరువ్యాపారులకు క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మాజీ చైర్మన్ మృతి



ప్రసాద్ (ఫైల్)

నల్లబెల్లి : మండలంలోని గుండ్లపహాడ్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ తుపాకుల ప్రసాద్ (65) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. ప్రసాద్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం తరలించారు. అప్పటికే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు కర్ణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి..

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాయపర్తి మండల కేంద్రానికి చెందిన కుంట రాజు (30) పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్సై చందర్ కథనం ప్రకారం.. ఈనెల 6న రాజు స్నేహితుడు వేముల కిరణ్‌తో కలిసి అతడి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు మీద పడి గాయాలపాలయ్యాడు. అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుగ్యాల వసంతరావు సోమవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా ఆయన మృతదేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదురుకోళ్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పాపయ్యపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన బుడిగె రవళి (28) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో మంగళవారం మృతి చెందగా ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్, సొసైటి డైరెక్టర మజ్జిగ రాంబాబు, మాజీ వార్డు సభ్యులు కన్నం వెంకన్న, యూత్ నాయకులు వినోద్, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు.. మహారాణులు

- పొదుపుతో అభివృద్ధికి బాటలు
- 32 ఏళ్లలో రూ.2.20 కోట్ల నిల్వలు

దుగ్గొండి : గతంలో వారంతా ఇంటికే పరిమితం అయ్యారు. ఆర్థికంగా ఎదిగేలా పొదుపుతో అభివృద్ధికి బాటలు వేసుకున్నారు. 32 ఏళ్లుగా ఐక్యతతో పొదుపు చేసుకుంటూ రూ.2.20 కోట్ల నిలువలకు చేరుకుని 'మహిళలు.. మహారాణులు' అన్న ఖ్యాతి సంపాదించారు. బ్యాంకులతో సంబంధం లేకుండా సొంతంగా కోట్ల రూపాయలు టర్నోవర్ చేస్తూ లక్షలాది రూపాయలు తక్కువ వడ్డీకే సభ్యులకు రుణాలిచ్చే స్థాయికి ఎదిగారు.

మండలంలోని తొగర్రాయిలో 70 మంది మహిళలు కలిసి 1993లో ఝాన్సీ మహిళా పొదుపు పరస్పర సహకార సంఘం ఏర్పాటు చేసుకున్నారు. మొదట ప్రతినెలా రూ.20 చొప్పున పొదుపు చేశారు. ఇంటింతై వటుడింతై అన్న చందంగా పొదుపును, సభ్యుల సంఖ్య పెంచుకుంటూ 670 మందితో సంఘటితమయ్యారు. సంఘాన్ని ఆర్థికంగా



సభలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు (ఫైల్)

బలోపేతం చేశారు. తాజాగా రూ.2.20 కోట్ల నిల్వ సాధించి సభ్యుల అవసరాలకు ప్రభుత్వ బ్యాంకులకు దీటుగా కేవలం 0.75 పైసల వడ్డీకి గరిష్ఠంగా రూ.1.70 లక్షల చొప్పున రుణం ఇస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడి, కుటీర పరిశ్రమల ఏర్పాటు నిర్వహణ, చిరు వ్యాపారాల కోసం 670 కుటుంబాలు సంఘం మీదే ఆధారపడ్డాయంటే అతిశయోక్తి లేదు. సభ్యులు మరణిస్తే సామూహిక బీమా, అభయనిధి నుంచి రూ.45 వేలు చొప్పున నామినీకి అందిస్తూ బాధిత కుటుంబాలకు సామాజిక తోడ్పాటు అందిస్తూ అండగా నిలుస్తున్నారు.

స్వశక్తిపై బతుకుతున్నాం



సంఘం సభ్యులం స్వశక్తిపై బతుకుతున్నాం. 70 మందితో రూ.20 పొదుపుతో మొదలుపెట్టి సభ్యులకు రూ.2 లక్షల రుణం ఇస్తున్నాం. కుటుంబాలకు అండగా ఉంటున్నాం.

– వేమునూరి యాదమ్మ, అధ్యక్షురాలు

క్రమశిక్షణతో ముందుకు



క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నాం. ఐదుగురు సభ్యుల బృందంలో ఒక్కరు సకాలంలో చెల్లించకున్నా అప్పు ఇవ్వకూడదనే నిబంధన పెట్టుకున్నాం. తనఖా లేకుండానే ఐదుగురు బృందం సభ్యుల సమక్షంలో రుణాలిస్తున్నాం.

– ఆవుల నవ్య, అకౌంటెంట్

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. పేదలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



గీసుకొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచిన సందర్భంగా పింగిళి శ్రీపాల్‌రెడ్డి మండలంలోని ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మండలంలోని శాయంపేట హవేలీ జెడ్పీ హైస్కూల్‌లో గతంలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలయంలో మొక్కుకున్న నేపథ్యంలో గెలిచాక వచ్చినట్టు తెలిపారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన్ను పీఆర్టీయూ నాయకులు అడప రామారావు, యుగేంధర్, వెంకటేశ్వర్లు, ఉడత రాజేందర్, మోహన్‌రావు, రతన్ సింగ్, రవీందర్‌రెడ్డి, మాలతి, స్వరూపరాణి, కర్ణకంటి రామ్మూర్తి, తదితరులు సన్మానించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

గీసుకొండ : మండలంలోని కొమ్మాలలో ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాతర ప్రాంతాన్ని సందర్శించారు. పార్కింగ్ పాయింట్, రూట్‌మ్యాప్, వన్‌వే, సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. మామునూరు ఏసీపీ తిరుపతి, గీసుకొండ సీఐ మహేందర్, ఎస్సై కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : కొమ్మాల జాతరలో అధికారులకు సూచనలు ఇస్తున్న డీసీపీ అంకితకుమార్

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకూడదు

దుగ్గొండి : కొమ్మాల జాతర సందర్భంగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకూడదని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ ఆదేశించారు. జాతరను పురస్కరించుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. మండలంలోని గిర్నిబావిలో ట్రాఫిక్ సమస్యపై సమీక్షించారు. వివిధ రాజకీయ పార్టీలు, భక్తులు ప్రభలను క్రమపద్ధతిలో జాతరకు తరలించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైతే ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాట్లు చేయాలని, నాలుగు సెక్టార్లుగా విభజించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రూపొందించిన మ్యాప్‌ను పరిశీలించి మార్పులు చేర్పులు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ సాయిరమణ, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట : అనుమతులు కలిగిన వెంచర్‌కు వెళ్లే రోడ్డును అక్రమంగా ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్లాట్ల యజమానులు, కొనుగోలుదారులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్ రావు, శ్రీనివాస్, నరసింహారెడ్డితోపాటు మరి కొందరు నర్సంపేటలోని నెక్కొండ రోడ్డులో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 670, 671, 672, 673లో కొనుగోలు చేసిన వ్యక్తులు వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు చేసినట్లు తెలిపారు. దీనికి అనుమతులు పూర్తిస్థాయిలో ఉన్నాయని, దీని పక్కనే 2014లో వెంచర్ ఏర్పాటు చేసి ఎల్‌ఆర్‌ఎస్ అనుమతి తీసుకుని ప్లాట్లకు వెళ్లే రోడ్డును నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి కొంత మంది రోడ్డును ధ్వంసం చేసి మట్టిని తరలించారని ఆరోపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి

- ఆర్‌బీఎస్‌కే వైద్యులు భవిత, స్వర్ణలత

చెన్నారావుపేట : అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని ఆర్‌బీఎస్‌కే వైద్యులు భవిత, స్వర్ణలత స్పష్టం చేశారు. మండలంలోని జోక్యతండాలోని అంగన్‌వాడీ సెంటర్‌ను మంగళవారం వారు సందర్శించి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలిచారు. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు భవిత, స్వర్ణలత మాట్లాడారు. పిల్లలకు పరిశుభ్రత అలవర్చాలని చెప్పారు. తద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేయాలని సూచించారు.



చిన్నారులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కార్యక్రమంలో ఫార్మసిస్ట్ స్మిత, ఏఎన్‌ఎం జూలక, ఆశ వర్కర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్ శౌరీలు, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి కంప్యూటర్ శిక్షణ

పర్వతగిరి : వేసవి సెలవుల సందర్భంగా కల్లెడ ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయ్ విద్యాలయలో మండలానికి చెందిన మహిళలు, విద్యార్థులకు ఈనెల 20 నుంచి 45 రోజుల పాటు రోజూ 2 గంటలు చొప్పున టాలీలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఇంటర్నెట్ సదుపాయంతోపాటు గంట తరగతి, గంట ప్రాక్టీస్ ఉంటాయని వివరించారు. ఆసక్తి కలిగిన మహిళలు, విద్యార్థులు కళాశాలలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 9490379775, 9494921759ల్లో సంప్రదించాలని సూచించారు.

అసైన్డ్ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : అసైన్డ్ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. చట్ట ప్రకారం అసైన్డ్ భూముల విక్రయాలు చెల్లవని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సర్వే నంబర్ 111, 702, 813, 204, తదితర సర్వే నంబర్లలోని అసైన్డ్ భూముల క్రయవిక్రయాలకు పాల్పడుతూ అక్రమార్కులు భూములు తమవంటూ గొడవలకు దిగుతూ శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మాషుక్, నాయకులు గజవెల్లి జగపతి, నకినబోయిన మహేశ్, అశోక్, మాలమ్మ, జమున, కృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

గీసుకొండ/సంగెం : విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ కోరారు. గీసుకొండ మండలంలోని కొమ్మాల, సంగెం మండలంలోని గవిచర్ల గ్రామాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లలో 'మాదక ద్రవ్యాలు–దుష్పరిణామాలు' అంశంపై మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణ, పోటీతత్వం అలవర్చుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నతంగా ఎదిగే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని చెప్పారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బ్యాగ్‌లు, పుస్తకాలు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమాల్లో డీసీపీఓ రాజు, హెచ్‌ఎంలు మోహన్‌రావు, రమ, కోఆర్డినేటర్లు అక్తర్, వనిత, తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష సామగ్రి అందజేత

పర్వతగిరి : మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులకు స్వేరోస్ నాయకులు గారె జయరాజ్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్, ఎడ్యుకేట్ ఎ జనరేషన్ సంస్థ ఇన్‌చార్జ్ బోడ డిన్న మంగళవారం పరీక్ష సామగ్రి అందజేసి మాట్లాడారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. ఎంఈఓ లింగారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని దృష్టిలో ఉంచుకుని చదువుకోవాలని సూచించారు. విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పదో తరగతి కీలకమన్నారు. క్రమశిక్షణతో చదువుకుని మెరుగైన గ్రేడ్ సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా కార్యదర్శి కందికట్ల ప్రవీణ్, నాయకులు తేజస్విని, యాకయ్య, భానోతు రమేశ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం వర్గీకరణ

వర్ధన్నపేట : జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను మంగళవారం జన్ను రాములుతో కలిసి మహేందర్ ప్రారంభించి మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని సూచించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదిక ప్రకారం 15 లక్షలు జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న క్రమంలో 32 లక్షల మందికిపైగా ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర సంతోష్, మాసాని గోపాల్, గోలి సుధాకర్, ముత్యాల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులై ఆకట్టుకున్నారు. మంగళవారం నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం నర్సింహులు అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, రజితదేవి, సాంబయ్య, రాజునాయక్, రజిత, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సబ్‌స్టేషన్ ప్రారంభం

- విద్యుత్ శాఖ ఎస్‌ఈ గౌతంరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

సంగెం : మండలంలోని గవిచర్లలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని ఆ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ) గౌతంరెడ్డి తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారుల సమస్యలను వివరిస్తూ 'సబ్‌స్టేషన్ ప్రారంభమెప్పుడో..?' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అధికారులతో కలిసి సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి అయిన విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలోనే సిబ్బందిని సర్దుబాటు చేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈలు ఆనందం, భిక్షపతి, ఏడీఈ నర్సింహారావు, ఏఈ అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, అధికారులు

రైతులకు మరిన్ని మెరుగైన సేవలు



నెక్కొండ : రైతులతో మాట్లాడుతున్న ఏడీఈ



దుగ్గొండి : పొనకల్‌లో మాట్లాడుతున్న ఏఈ

- విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీధర్

నెక్కొండ : రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీధర్ తెలిపారు. మండలంలోని సూరిపల్లిలో మంగళవారం నిర్వహించిన 'పొలం బాట' కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరా, వోల్టేజ్, తదితర అంశాలపై సూచనలు అందించారు. రైతులు స్విచ్ బోర్డు, మోటార్ స్టార్టర్ల వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచనున్నామని తెలిపారు. అవసరమైన ప్రదేశాల్లో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఏఈ చిరంజీవి, ఏఎల్‌ఎం చీకటి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి

దుగ్గొండి : రైతులు పంపుసెట్లు చెడిపోకుండా, నాణ్యమైన విద్యుత్ అందేలా కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ ప్రత్యూష సూచించారు. మండలంలోని పొనకల్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులకు ఆమె అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరాలోని సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. మోటార్లకు నాణ్యమైన వైరు, స్టార్టర్ వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ అజీమ్ పాషా, ఏఎల్‌ఎం అజయ్, నాగరాజు, బలభద్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట



గీసుకొండ : వంచనగిరి కేజీబీవీలో విద్యార్థినులతో ఫ్లోరెన్స్, ఎస్‌ఓ, తదితరులు

- జీసీడీఓ ఫ్లోరెన్స్

గీసుకొండ : విదార్థినుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నట్టు జీసీడీఓ ఫ్లోరెన్స్, లెర్నింగ్ కర్వ్ ప్రతినిధి స్వప్న తెలిపారు. మండలంలోని వంచనగిరిలోని కేజీబీవీలో ప్రాజెక్ట్ డిగ్నిటీ పేరుతో లెర్నింగ్ కర్వ్, జనరల్ ఇన్సూరెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు వారు మంగళవారం శానిటరీ న్యాప్కిన్లు, ఇన్సినేటర్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. న్యాప్కిన్లు, ఇన్సినేటర్ల వినియోగంపై స్పెషల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ అసోసియేట్ తులసి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని పెద్దకొర్పోలులోని కేజీబీవీలో విద్యార్థులకు ఎంఈఓ రత్నమాల దుప్పట్లు, శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రణాళికాయుతంగా చదువుకోవాలని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం విటమిన్ ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సెల్ఫ్ డిఫెన్స్ విన్యాసాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎస్‌ఓ రజిత, ఉపాధ్యాయులు విజయశ్రీ, లక్ష్మి, అనిత, రజిత, భార్గవి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

'స్థానిక' ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గుంటూరుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని బీమ్లానాయక్‌తండాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మంగళవారం బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువజన సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో యువతకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు కేటాయించేందుకు అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్‌రెడ్డి, పట్టణ కమటీ అధ్యక్షుడు గూడూరు సందీప్, యువమోర్చా నాయకులు జూలూరి మనీష్ గౌడ్, బట్టు మదన్, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

విద్యారంగానికి 30 శాతం కేటాయించాలి

- ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

వర్ధన్నపేట : కొఠారి కమిషన్ నివేదిక మేరకు విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్ఐ మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలోని వర్ధన్నపేట–జఫరగడ్ రహదారిపై మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేత దిశగా సాగుతున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేలా బడ్జెట్‌లో నిధులు పెంచాలని ఆకాంక్షించారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి అవగాహన కల్పించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వర్, రాజేశ్, విష్ణు, సూర్య, అనిల్, అక్షయ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.